క్లుప్తంగా

డ్రోన్ స్ప్రేయింగ్‌తో మంచి ఫలితాలు



డ్రోన్ స్ప్రేయింగ్ విధానాన్ని వివరిస్తున్న ఏఓ

ద్వారకాతిరుమల : డ్రోన్ స్ప్రేయింగ్ విధానం ద్వారా వరి సాగులో మంచి ఫలితాలు సాధించొచ్చని మండల వ్యవసాయ అధికారి దుర్గారమేష్ అన్నారు. బుట్టాయిగూడెం గ్రామంలో రైతులకు మంగళవారం డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన, డెమోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఎంటర్ సేవా పథకం కింద ప్రతి మండలానికి మూడు డ్రోన్లు సబ్సిడీపై అందిస్తున్నారని, యూనిట్ ఖరీదు రూ.10 లక్షలు కాగా, అందులో రూ.4 లక్షలు సబ్సిడీ రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ ఉపయోగించడానికి గ్రూపులో ఒకరికి ప్రభుత్వం పైలెట్ శిక్షణ ఇస్తుందన్నారు. అనంతరం సత్తాల పంచాయితీ సంద్రకుంటలో రైతులకు డ్రోన్ స్ప్రేయింగ్‌పై డెమో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం సర్పంచ్ వెంకట సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముల్లంగి ఈశ్వరరెడ్డి, సత్తాల సర్పంచ్ కొండాబత్తుల సుభద్ర, గిరి, వీపీఏ పి.జ్యోతి, జంగారెడ్డిగూడెంకు చెందిన గరుడ ఏరోస్పేస్ (సాయిరాం మోటార్స్) కంపెనీ డీలర్ టీజీ రాజు, కంపెనీ పైలెట్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పీపీఏ బృందం పర్యటన

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) బృందం సభ్యులు రెండురోజుల పాటు పరిశీలించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో) శివనందన్ కుమార్, మెంబర్ సెక్రటరీ ఎం.రఘురామ్, చీఫ్ ఇంజినీర్ రాజేష్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలి

జంగారెడ్డిగూడెం : కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆశన్నమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలి అంటూ నినాదాలు చేశారు. నాయకులు మునీర్, నన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జంగారెడ్డిగూడెం : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ జె.భీమశేఖర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం కొత్తపేటకు చెందిన దారం గణేష్‌కుమార్, శ్యామల భార్యాభర్తలు. వీరు తరచుగా గొడవలు పడుతున్నారు. ఈ నెల 20న భార్యభర్తలు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 22న కూడా వాగ్వివాదం జరగగా, రామచంద్రాపురంలో ఉన్న ఫొటోస్టూడియోకు గణేష్‌కుమార్ వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ రావడంతో శ్యామల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి వారికి పన్నీరుతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

జగనన్న కాలనీల్లో ఫ్రీ కరెంట్ కనెక్షన్లు

- 30 వేల మందికి రూ.15 కోట్లు మంజూరు
- లబ్ధిదారులకు రూ.5 వేలు చొప్పున లబ్ధి

ఏలూరు రూరల్: ఏలూరు నియోజకవర్గం జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. ప్రతి ఇంటికీ సర్వీస్ వైర్, మీటర్, బోర్డు, ఎంసీబీ, ఎర్త్‌వైర్ బిగిస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి కాగానే ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి లబ్ధిదారుడి ఆధార్, ఇంటి స్థల పట్టా జిరాక్స్ తీసుకుంటున్నారు. పత్రాలు ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి కరెంట్ కనెక్షన్ అందిస్తున్నారు. ఇందు నిమిత్తం లబ్ధిదారుడు ఒక్కపైసా కూడా చెల్లించాల్సిన పని లేదు. దీంతో ఒక్కొక్కరికీ రూ.5 వేలు లబ్ధి చేకూరుతోంది.



లక్ష్మీపురం జగనన్నకాలనీలో ఉచిత విద్యుత్ మీటర్ బిగిస్తున్న సిబ్బంది, తంగెళ్లమూడిలో లబ్ధిదారుని ఇంటికి కరెంట్ కనెక్షన్ ఇస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

30 వేల మీటర్ల ఏర్పాటు

నియోజకవర్గంలో ప్రభుత్వం మొత్తంగా రూ.30 వేల ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఇందులో మొదట ఏడాది పోణంగిలో 7035, కొమడవోలులో 9954, లక్ష్మీపురంలో 7017 అందించింది. 90 రోజుల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా మరో ఆరు వేల స్థలాలు పేదలు అందుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కాలనీల్లో ఇళ్లు కట్టుకున్న వారికి 24 గంటల్లో కరెంట్ కనెక్షన్ ఇస్తున్నారు.

చకచకా పనులు

పోణంగి, కొమడవోలు, లక్ష్మీపురం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు చకచకా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి భూమి కొనుగోలు చేసింది. వేల క్యూబిక్స్ మీటర్ల మట్టి తరలించి స్థలాలను మెరక చేయించింది. రోడ్లు నిర్మించింది. బోర్లు వేసి తాగునీటి పైప్‌లైన్ వేయిచింది. కాలనీ మొత్తానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మిస్తోంది. స్తంభాలను పాతి వీధిలైట్లు వేస్తోంది. ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికీ రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోంది.

పరిశుద్ధ నిత్యసహాయ మాత ఊరేగింపు


నిత్యసహాయమాతను ఊరేగిస్తున్న ఫాదర్ డేవిడ్, గ్రామస్తులు

దెందులూరు : పోతునూరులో పరిశుద్ధ నిత్యసహాయమాత పండుగ ఘనంగా జరిగింది. మంగళవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫారీస్ క్రీస్ట్ ఫాదర్ డేవిడ్ అమ్మవారి ప్రతిమతో సంఘస్తులు, మరియదళ సభ్యులు, గ్రామపెద్దలతో కలిసి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ డేవిడ్ దివ్యబలిపూజ అర్పించారు.

వర్జీనియా తోటల పరిశీలన


వర్జీనియా తోటలను పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం : వర్జీనియా తోటల్లో నల్లమచ్చ తెగులు, పొటాషియం లోపం గుర్తించినట్లు వర్జీనియా వేలం కేంద్రం అధికారి జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-1 పరిధిలోని ముప్పినివారిగూడెం, దొరమామిడి, కోటనాగవరం గ్రామాలను మంగళవారం వేలం కేంద్రం అధికారులు క్షేత్రపర్యటన చేశారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యమైన పొగాకు ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వేలం అధికారి బి.శ్రీహరి, ఎస్‌జీవో కె.శ్రీధర్, ఐటీసీ ప్రతినిధి చారువాక, జీపీ ప్రతినిధి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నగరంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అక్కౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారికత అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రధాన వక్తలుగా డాక్టర్ జి.నవ్యకళ, సీఆర్‌ఆర్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సి.అరుణ కుమారి పాల్గొని మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, సీఏ వి.రవికిరణ్, సీఏ కె.కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

- సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో నరసింహరావు పేట మహిళా పోలీస్ మందా శాంత కుమారి మాట్లాడుతూ బాలికల రక్షణ, బాలికల విద్య, బాలికల క్షేమాభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన పథకాలు, హక్కులు, చట్టాలను వివరించారు. ప్రధానోపాధ్యాయిని కనిగంటి మరియమ్మ, ఉపాధ్యాయినులు కందికొండ అరుణా కామేశ్వరి, కొల్లిపర నాగ అపర్ణ, కె.బ్రిజిట్, ఎ.పద్మలత తదితరులు పాల్గొన్నారు.


సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో మాట్లాడుతున్న అరుణ కుమారి


సెయింట్ థెరిస్సా పాఠశాలలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బాలికలు

- సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ఉమెన్ ఎమ్‌పవర్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణు మోహన్ మాట్లాడారు. ఉత్తమ సమాజం, మంచి భవిష్యత్ కోసం బాలికలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ కొండయ్యరావు, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రిన్సిపాల్ ఎ.వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకృష్ణ దేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో బాలికల హక్కులు, సంరక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు పి.వెంకటేశ్వర రావు, ప్యానల్ లాయర్ జీవీ భాస్కర్ మాట్లాడారు.

25న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సదస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ప్రజా రవాణా శాఖ) పరిధిలోని ఏలూరు డిపో మేనేజర్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని, ద్వారకాతిరుమలలో ఉన్న స్థలాన్ని 15 సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరులోని ప్రజారవాణా కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఫిబ్రవరిలో ఆత్మీయ సమావేశాలు


వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఫిబ్రవరి 3,4,5 తేదీల్లో ఏలూరులో ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్యనేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఏలూరు నియోజకవర్గంలో సచివాలయ కన్వీనర్ల నియామకం పూర్తి చేశామని, గృహసారథుల తుది జాబితాను కేంద్ర కార్యాలయానికి అందజేశామని నాని చెప్పారు. ప్రజా సేవ పట్ల తపన, పార్టీ పట్ల అంకితభావం గల వ్యక్తులను గృహసారథులుగా ఎంపిక చేశామన్నారు. ప్రతి 50 ఇళ్లకు స్థానికంగా ఉండే ఒక మహిళ, ఒక పురుషుడుతో ఇద్దరు గృహ సారథులు ఉండేలా బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. వీరందరితో ఫిబ్రవరి మొదటి వారంలో ఏలూరు సారథి గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మధ్యాహ్నపు బలరాం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, ఏఎంసీ డైరెక్టర్ కోరాడ బాబు, పార్టీ నాయకులు పారిపిరెడ్డి నాగేశ్వరరావు, కొల్లిపాక సురేష్, నిడుకొండ నరేంద్ర, తోట సుధీర్, నున్నా కిషోర్, భారతి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగం తప్పనిసరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగం ప్రతి పౌరునికీ ఇచ్చిన బాధ్యత ఓటు హక్కు అని సీనియర్ సిటిజన్స్ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడూ ఓటు ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. ప్రజా స్వామ్యమనే అతిపెద్ద వృక్షానికి ఓటు విత్తనం లాంటిదని, విత్తనం మంచిదైతేనే ఆశించిన ఫలాలు సాధించగలమని అన్నారు. ఓటు పొందే వరకే మన హక్కని, తరువాత దాన్ని వినియోగించుకోవడం తప్పనిసరి బాధ్యతని గుర్తు చేశారు. పాలనలో ప్రతి ఒక్కర్నీ భాగస్వాములను చేయాలనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికీ ఓటు హక్కును పొందేందుకు అర్హులుగా పేర్కొన్నారని తెలిపారు. కళాశాల విద్యలో ఓటు విలువను తెలియజేస్తూ పాఠ్యాంశంగా చేర్చాలని, చలన చిత్ర ప్రదర్శనలో న్యూస్ రీల్‌లో ఓటు విలువ తెలియజేస్తూ డాక్యుమెంటరీలను ప్రదర్శించాలని కోరారు. ఎన్నికల్లో పోటీచేసే వారు రాజ్యాంగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్లను చైతన్యం పర్చడానికి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం, ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థ, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు కె.రామచంద్రరావు, ఎం.శివరామకృష్ణ, ఎంబీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. రహదారి భద్రత కోసం ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని పైడేశ్వరరావు సూచించారు. ఆటో డ్రైవర్లకు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.విజయరాజు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు రవాణా శాఖ అనేక జాగ్రత్త చర్యలు చేపడుతోందని చెప్పారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలయిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ పైడేశ్వరరావు

వాహనాల వేలం

చింతలపూడి : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. వేలంలో 8 వాహనాలకు గాను రూ.91,200 ఆదాయం వచ్చినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

చింతలపూడి : చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల మైనర్ బాలికను అపహరించిన కేసులో భూక్యా కళ్యాణ్ అనే యువకుణ్ణి అరెస్ట్ చేసినట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఆయన చెప్పారు.

1 నుంచి నరసింహస్వామి కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాధపురంలో సుందరగిరిపై కొలువైన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 1 నుంచి 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. అందుకు భారీగా ఏర్పాట్లు చేయనున్నట్టు ఆలయ ఈఓ. వేండ్ర త్రినాధరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 1న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 3న ఉదయం కొండ కింద కల్యాణ మండపంలో స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు. 4న సాయంత్రం గ్రామోత్సవం, 5న పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, పూర్ణాహుతి వేడుకలు జరుగుతాయి. 6న జరుగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ. తెలిపారు. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.


సుందరగిరిపై విశేష అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

వృద్ధుల హెల్ప్‌లైన్ పోస్టర్ ఆవిష్కరణ

భీమడోలు : వృద్ధుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని హౌసింగ్ ఈఈ యు.సోమేశ్వరరావు అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఎన్ఆర్‌జీఎస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఈఈ యు.సోమేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ 14567 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంకా 681 మంది ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదని, వారిని చైతన్యపర్చి నిర్మాణాలు ప్రారంభించేలా గ్రామ స్థాయిలో సచివాలయాలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. నాడు-నేడు పాఠశాలల్లో భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలన్నారు. డిజిటల్ లైబ్రరీ, ఇతర ప్రభుత్వ భవనాలను గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, ఏఈలు సీహెచ్ సతీష్, డి.సత్యనారాయణ, ఏపీఎం సురేష్‌కుమార్, ఏపీవో కె.పద్మ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	21
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	24

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న కామిరెడ్డి నాని

దెందులూరు : వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధి, అంకితభావంతో కృషిచేయాలని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ అధ్యక్షతన గృహ సారథులు, జగనన్న సచివాలయ కన్వీనర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ పార్టీ ఆశయాలు గుర్తెరిగి పార్టీ నియమ నిబంధనలకు లోబడి పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాళి ఈశ్వరయ్య, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు, నాయకులు పర్వతనేని నరేంద్ర, పేరం ప్రసాద్, పి.బాబ్జి, పుల్లా ప్రసాద్, పేరం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ డైరీ 2023 విడుదల



పోలీస్ డైరీని విడుదల చేసిన ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం 2023 డైరీని ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ డైరీలో శాఖాపరమైన అంశాలతో పాటు ఇన్‌కంటాక్స్, పోలీస్, సర్క్యులర్స్, ఇతర సమాచారం పొందుపరిచారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ కృష్ణంరాజు, పోలీస్ సంక్షేమ నోడల్ ఆఫీసర్ ఎం.రాజా, సీఐలు బోణం ఆదిప్రసాద్, పి.చంద్రశేఖర్, కేవీఎస్ వరప్రసాద్, దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు, సీహెచ్ మురళీకృష్ణ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌బాబు, స్టేట్ సెక్రటరీ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.